క్లుప్తంగా

ఎర్రబెల్లికి కుమ్మరి సంఘం మద్దతు



దేవరుప్పుల: అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావుకు దేవరుప్పుల కుమ్మరి సంఘం సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఆదివారం జనగామలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో కుమ్మరి సంఘం ప్రతినిధులు కలిసి మద్దతు పలుకగా ఎర్రబెల్లి కృతజ్ఞతగా కులవృత్తి పురోగతికి పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం ప్రతినిధులు లింగాల సత్తయ్య, గౌరవయ్య, ఐలయ్య, నర్సయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన హనుమాండ్ల కుటుంబీకులు



పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మామిడాల యశస్వినిరెడ్డికి టికెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీలక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, అభ్యర్థి మామిడాల యశస్విని, భర్త హనుమాండ్ల రాజారామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

నేడు పాలకుర్తికి యశస్విని రెడ్డి రాక

పాలకుర్తి నియోజకవర్గ కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్వినిరెడ్డితో పాటు ఝాన్సీరెడ్డి చేరుకొని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, అనంతరం 12.30 మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ప్రెస్‌మీట్‌లో పాల్గొంటారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమార స్వామి తెలిపారు.

'కాంగ్రెస్ నాయకులను తండాల్లో తిరగనివ్వం'

జనగామ: కాంగ్రెస్ ఏఐసీసీ ఆదివాసీ వైస్ చైర్మన్, ఆదివాసి తెలంగాణ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌కు ఇల్లందు అసెంబ్లీ టికెట్ ఇవ్వని పక్షంలో ఆ పార్టీ నాయకులను తండాలో తిరగనివ్వబోమని లంబాడ హక్కులపోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సునావత్ సుమన్ నాయక్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 40లక్షల మంది గిరిజనులు 70 నుంచి 80 స్థానాల్లో గెలుపోటములను నిర్ణయిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు లావుడియా, అము రాజు, జగన్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



పసుల రవి

దేవరుప్పుల: మండల కేంద్రంలోని యువ చైతన్య ఆటో యూనియన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పసుల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఉల్లి చంద్ర సేనా చారీ, ఉపాధ్యక్షుడిగా జాటోత్ నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా చింత యాదగిరి, కోశాధికారిగా బొందుగుల యాకస్వామి, కార్యవర్గసభ్యులుగా చెల్మారెడ్డి, మల్లారెడ్డి, రమేష్, శ్రీనివాస్, యాకయ్య, బిక్షపతి పరుశరాములు, సోమ సుందర్ తదితరులు ఎన్నికయ్యాన్నారు.

గుంత పూడ్చివేత



చిల్పూరు: చిల్పూరుగుట్ట నుంచి చిల్పూరుకు వెళ్లే రోడ్డులో బర్రెంకల చెరువు సమీపంలో లోలెవల్ బ్రిడ్జి రోడ్డుపై ఆదివారం పెద్ద గుంత పడింది. దీంతో వాహన రాకపోకలకు ప్రమాదంగా ఉంటుందని వెంటనే గ్రామ యువకుడు, వాహన చోదకుడు గనగోని నవీన్, సర్పంచ్ రాజ్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించి గుంతను పరిశీలించి మొరంతో పూడ్చించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

'విశ్వబ్రాహ్మణ' సభ కరపత్రాల ఆవిష్కరణ

హన్మకొండ: నవంబర్ 5వ తేదీన హైదరాబాద్ ఉప్పల్‌లోని బగాయిత్‌లో జరగనున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహాజన సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విశ్వబ్రాహ్మణుల ఐక్యతను చాటాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మహాజన సభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి



నర్మెట: వెల్దండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం, ఏఈఓ

నర్మెట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీఎం మాదారపు రవి అన్నారు. మండలంలోని వెల్దండలో ఐకేపీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సంబధిత అధికారులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే ఏ గ్రేడ్ క్వింటాకు రూ.2,203, సాధారణ రకం క్వింటాకు రూ.2,183 చెల్లించడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఉషోదయ గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు మంకెన కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీసీలు యాదగిరి, కవిత, కుమార స్వామి, ఏఈఓ కన్నయ్య, వీఓఏలు భవాని, శోభారాణి, ప్రత్యూష, కృష్ణవేణి సంఘ సభ్యులు లింగాల విజయ, రాజేశ్వరి, జయప్రద, మేఘమాల, దేవదానం, రైతులు లక్ష్మారెడ్డి, క్రాంతి కుమార్, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

చిల్పూరు: రైతులకు మద్దతు ధర కల్పించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్, వెంకటాద్రిపేటల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఈఓ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు మధుసూదన్, బాబు, సీఏలు రమాదేవి, శారధ, యమున, కృష్ణవేణి, గంగ, ప్రతిభ గ్రామైక్య సంఘం ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాలపై 'కొమ్మూరి' తప్పుడు ప్రచారం

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సేవెల్లి సంపత్



మాట్లాడుతున్న సంపత్

జనగామ: జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుల సంఘాలపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సేవెల్లి సంపత్ అన్నారు. బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను డబ్బులు తీసుకుని, పార్టీ మారినట్టుగా కొమ్మూరి అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీ పుణ్యమాని జెడ్పీటీసీగా గెలుపొంది, అనేక పార్టీలు మారిన ఘనత ప్రతాప్‌రెడ్డికి ఉంటే, తాను మాత్రం ముందు నుంచి బీఆర్ఎస్‌లోనే ఉన్నానన్నారు. ఆయనకు రియల్ వ్యాపారం తప్ప, ప్రజల సమస్యల పట్టవన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి ఎన్ని కోట్లు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నావని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని 40వేల మంది కురుమలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. తమపై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ పేర్ని స్వరూప, ఏఎంసీ డైరెక్టర్ సేవెల్లి మధు, నాయకులు కన్నారపు ఉపేందర్, జూకంటి శ్రీశైలం, ఆలేటి రాజు, సురేష్, ఐలయ్య, ప్రదీప్, వనేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోండి



కేసిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

బచ్చన్నపేట: శాసన సభ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల పలు గ్రామాల్లో నాయకులు గడప గడపకు కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. సమస్యలు తెలిసిన స్థానిక నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అనర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్ల అప్పగింత'



గుడిసెలో నివసిస్తున్న దళిత కుటుంబంతో నాయకులు

కొడకండ్ల: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నాయకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించి అర్హులకు దక్కకుండా తమ వారికే కేటాయించుకున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆరోపించారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించి వ్యవసాయ భూములున్న, అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న వారికి, బీఆర్ఎస్ కార్యకర్తలకు కేటాయించారని, అర్హులైన నిరుపేదలకు మొండి చెయ్యి చూపారని, ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కారని, బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహించారని ఆయన ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనర్సయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, వెంగల్‌రావు, భిక్షపతి, శ్రీవర్ణ, మహేందర్, శ్రీనివాస్, సోమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

జనగామ: పట్టణంలోని వీవర్స్ కాలనీ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 11, 12 వార్డులకు చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ యువనాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ కౌన్సిల్ కాంటెస్ట్ అభ్యర్థి వెంకటేష్ ఆధ్వర్యంలో 100 మంది కాంగ్రెస్‌లోకి రాగా, కండువాలు కప్పి స్వాగతం పలికినట్లు చెప్పారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు జిల్లెల్ల సిద్దారెడ్డి, ఉడత రవి యాదవ్, శ్రీరాం శ్రీనివాస్, బొంతపల్లి నాగరాజు, పిట్టల సతీష్, శ్రీనివాస్, బిర్రు సత్యనారాయణ, ఎనగందుల వెంకటేష్, వేమెళ్ల అభిలాష్ రెడ్డి, రచ్చ సత్యనారాయణ, కాముని సమ్మయ్య, గందమల్ల కమలాకర్, రచ్చ శ్రీనివాస్, ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పల్లా

నర్మెట: మండలంలోని ఆగాపేటకు చెందిన వైఎస్సార్‌టీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ ముప్పిడి లక్ష్మీవిజయప్రతాప్, పార్టీ గ్రామ అధ్యక్షుడు మెడబోయిన రాజు, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 25 మంది ఆదివారం పల్లాను కలిసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తోకల శేఖర్‌తో పాటు 10 మంది నాయకులు, వైఎస్సార్‌టీపీకి చెందిన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నబోయిన రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మార్క రమేష్, ఉపాధ్యక్షుడు పిట్టల స్వామి, సోషల్ మీడియా అధ్యక్షుడు నక్క సుధాకర్, యూత్ అధ్యక్షుడు రాజబోయిన శ్రీధర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని భాస్కర్, ఉపాధ్యక్షుడు పిట్టల కార్తీక్ తోపాటు మరో 5 గురు ఉన్నారు. జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బుడ్డా భాస్కర్, గోగు గట్టయ్య, నాగరాజు, ముడికె గట్టుమల్లు, మార్క గణేష్, మెరుగు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన డిక్లరేషన్ అమలు చేయాలి



డిక్లరేషన్ పత్రాలను చూపుతున్న సేన సభ్యులు

నర్మెట: మండలంలోని తండాల్లో మౌలిక వసతులు కొరవడి తండావాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మండల సేవాలాల్ సేన అధ్యక్షుడు ధరావత్ రమేష్ అన్నారు. మండలం కేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పది డిమాండ్లతో కూడిన గిరిజన డిక్లరేషన్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. తరాలు మారినా, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తండాలవాసుల తలరాతలు మారడంలేదని, జిల్లా కేంద్రంలో బంజారా భవన్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతీ తండాకు బీటీరోడ్ల నిర్మాణాలు, పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఎన్నికల ప్రచారానికి వస్తున్న అభ్యర్థులు డిక్లరేషన్‌పై లిఖిత పూర్వక హామీలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేన ఉపాధ్యక్షుడు సుమన్, ఆర్గనైజింగ్ సెక్రటరి భీంసింగ్ , సభ్యులు సురేష్, కిష్టయ్య, ప్రవీణ్, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు'



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: మోసపూరిత కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ ఘన్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో కడియం ఇంటింటా ప్రచారం చేపట్టారు. శివునిపల్లి బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసిన కడియం అక్కడ నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ప్రచార రథంపై ర్యాలీగా వచ్చారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాజకీయ జన్మనిచ్చింది స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గమని, ఆశీర్వదించి గెలిపిస్తే తన మార్కు అభివృద్ధి చేస్తానన్నారు. గతంలో శివునిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బెలిదె వెంకన్నగుప్తా, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, రాపోలు మధుసూదన్‌రెడ్డి, మాచర్ల గణేష్, బూర్ల శంకర్‌ముదిరాజ్, శివునిపల్లి ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకుడు కృష్ణమూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

దళితులను గుర్తించింది బీఆర్ఎస్సే

స్టేషన్‌ఘన్‌పూర్: దళితులను గుర్తించి ఆర్థికంగా ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అని అందుకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపునకు కృషిచేస్తామని మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నియోజకవర్గం ఇన్‌చార్జ్ గాదెపాక నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

'అన్ని వర్గాల ప్రజలు కడియం వైపే'

చిల్పూరు: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపుకోసం అన్ని వర్గాల ప్రజలు ఆయన వైపే ఉన్నారని పార్టీ జిల్లా నాయకుడు ఇల్లందుల సుదర్శన్ అన్నారు. చిన్నపెండ్యాలలో ఆదివారం అన్ని కుల సంఘాల బాధ్యులు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

శ్రీహరిని కలిసిన వడ్డెర సంఘం నాయకులు

పల్లగుట్టకు చెందిన వడ్డెర సంఘం నాయకులు చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిని కలిశారు. తామంతా కడియం గెలుపునకు కృషిచేస్తామన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

లింగాలఘణపురం: నెల్లుట్లకు చెందిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొరిగె మల్లయ్య బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీహరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.

టీపీసీసీ కార్యదర్శి చేపూరి..

స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లుకు చెందిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి వినోద్ శనివారం ఘన్‌పూర్‌లో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, కడియం శ్రీహరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.

పార్టీ నేతలను సమన్వయం చేస్తేనే హస్తగతం



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నేతలను సమన్వయంచేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో హస్తగతం ఖాయమని ఎన్ఆర్ఐ కాంగ్రెస్ విభాగం నాయకుడు ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాలకుర్తి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ అభ్యర్థిత్వం కోసం హనుమాండ్ల ఝాన్సీలక్ష్మీరెడ్డి, డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ తోపాటు తాను ఆశించామన్నారు. ఝాన్సీలక్ష్మీరెడ్డికి పౌరసత్వ సమస్య వల్ల ప్రత్యామ్నాయంగా అధిష్టానం ఆమె కోడలు యశస్వినిరెడ్డికి టికెట్ ఖరారు చేసి తమల్ని గెలుపునకు కృషి చేయాలని ఏఐసీసీ, టీపీసీసీ ఆజ్ఞను శిరసావహించి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పాటుపడుతామన్నారు. టికెట్ ఆశించే క్రమంలో మద్దతు పలికిన పార్టీ శ్రేణుల మధ్య భేదాభిప్రాయలు ఏర్పడిన తరుణంలో ఎన్నికల రంగంలోకి దిగిన అభ్యర్థి యశస్వినిరెడ్డి నిలుపుకొని పార్టీ కోసం ముందుకు వెళ్తే కాంగ్రెస్ పార్టీ గెలుపు అనివార్యమన్నారు. సమావేశంలో నాయకులు అల్లం ప్రదీప్ రెడ్డి, వీరారెడ్డి దామోదర్ రెడ్డి,కాసాని ఎర్రయ్య, రవీందర్ నాయక్, మహేందర్ రెడ్డి, రవి,రాహుల్ నాయక్, మహ్మద్ సలీం, సోమన్న, యాదగిరి, రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

పాలకుర్తి: మండలంలోని తిర్మలగిరిలో గోవింద్ హరికుమార్(30) మృతి చెందాడు. కాగా, ఆదివారం గ్రామస్తులు రూ.10 వేలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే సర్పంచ్ బక్క పుల్లయ్య రూ.10 వేలు, సరుకులు అందజేశారు. మృతుడికి భార్య శిరీష, కూతుర్లు అసేత్రీ, సత్యశ్రీ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

'బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

దేవరుప్పుల: తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయపార్టీలకు తావులేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దమడూరు, కామారెడ్డి గూడెంలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఊరూరా సమర్థులైన బాధ్యులను బూత్ కమిటీల్లో చోటు కల్పించి దయాకర్‌రావు గెలుపు చరిత్రాత్మకంగా నిలిచేలా పాటుపడాలని సూచించారు. ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ మండల సమన్వయకర్తలు మనోహర్‌రావు, పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషం, జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి చింత రవి, అధికార ప్రతినిధి హన్మంతు, ఉపాధ్యక్షుడు నల్లా ఉమేష్, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించి గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తా..



ప్రచార ర్యాలీలో రామ్మోహన్‌రెడ్డి

కొడకండ్ల: స్థానికుడినైన తనను ఎన్నికల్లో ప్రజలు ఆదరించి గెలిపిస్తే సేవకుడిలా అందుబాటులో ఉంటూ పాలకుర్తి అభివృద్ధికి పనిచేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి లేగ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వచ్ఛందంగా అన్ని వర్గాల వారు తనను ఆదరిస్తున్నారని, తెలంగాణలో కేసీఆర్ దుర్మార్గ పాలనను అంతమొందించి నీతివంతమైన బీజేపీ సుపరిపాలనను కోరుకొంటున్నారని అన్నారు. బలహీన వర్గాలకే సీఎం పదవిని బీజేపీ ప్రకటించినందున బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజనులకు బీజేపీని ఆదరించి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, నియోజకర్గ, మండల నాయకులు శ్రీమాన్, కోటేశ్వర్‌రావు, మహేందర్, సోమన్న, రంగు రాములు,కన్నయ్య , శ్రీనివాస్, మహేష్,హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అండగా నిలవాలి



రఘునాథపల్లి: గ్యారంటీ పథకాలను వివరిస్తున్న జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి ఎన్నికల్లో విజయాన్ని అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వీరారెడ్డితండా, వేణుగోపాలస్వామితండా, చింతలగూడెం, గోవర్ధనగిరిలో ఆయన పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోయే ఆరు గ్యారంటీ స్కీంలపై ఇంటింటా కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిరను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మీనరేందర్, నాయకులు కోళ్ల రవిగౌడ్, జోగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, వీరారెడ్డి, మల్లేశం, వెంకటేశ్వర్లు, వేణు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు: పేద ప్రజలకు అవసరమయ్యే ఆరు గ్యారంటీ పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వాలని జిల్లా కార్యదర్శి మర్రి దుర్గాప్రసాద్ కోరారు. మండలంలోని పల్లగుట్ట, చిల్పూరు గ్రామాల్లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర గెలుపునకు పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. గట్టయ్య, లవన్‌కుమార్, రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతు

చిల్పూరు: పల్లగుట్టలోని 6వ వార్డులో చేతిపంపు మరమ్మతులకు నోచుకోక పోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఆదివారం చిల్పూరు ఆలయ చైర్మన శ్రీధర్‌రావుకు వార్డు మహిళలు విన్నవించారు. వెంటనే స్పందించి ఆయన సొంత నిధులతో చేతిపంపును బాగు చేయించి తాగు నీరు అందేలా చేశారు.

పరామర్శ

గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు బెల్లి సమ్మయ్య తండ్రి యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలియగానే శ్రీధర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బొట్టు చేరాలు, జీడి రమేష్, ఆనందం, చిర్ర నాగరాజు, సంపత్ రాజు, చల్లారపు శ్యాంసుందర్‌రెడ్డి, జయప్రకాష్, దార రవి, అశోక్‌పాల్, రత్నాకర్‌రెడ్డి, మల్లేషం తదితరులు ఉన్నారు.

'పాలస్తీనాపై దాడులు ఆపాలి'



మాట్లాడుతున్న సోమయ్య

జఫర్‌గఢ్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ సైనిక దాడులను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తాటికాయల రేనా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొద్ది రోజులుగా ఇజ్రాయెల్ పాలస్తీనాపై గాజాను కేంద్రంగా చేసుకొని వైమానిక దాడులతో యుద్ధ కాండను కొనసాగిస్తున్నదన్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో 6 వేల మంది మృత్యువాత పడ్డారన్నారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. పార్టీ మండల నాయకులు కాట సుధాకర్, నరసింహ, బంగారు చిరంజీవి, నల్లతీగల యాకయ్య, బాబు, వెంకటేశ్వర్లు, భారతలక్ష్మి, శోభ, కోమల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



పాలకుర్తి: మండలంలోని మంచుప్పులకు చెందిన మొత్కుపల్లి యాదగిరి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు విరాళంగా అందజేశారు. బండి ఆశ క్రాంతి జన్మదినం పురస్కరించుకొని సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీపతి, కార్యదర్శి జీడీ హరీశ్ పాల్గొన్నారు.